ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్నూలు
జిల్లా వార్తలు
సోమవారం 24 మార్చి 2025

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరి
	సోమవారం	మంగళవారం
కర్నూలు	6:35	4:57
నంద్యాల	6:31	4:57



ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు. గాయపడుతున్నారు. ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ప్రమాదాలు ఏమాత్రం తగ్గడం లేదు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా ఎంతోమంది ప్రాణాలు కోల్పోయి కుటుంబాల్లో విషాదాన్ని నింపుతున్నారు. కర్నూలు జిల్లాలో ఇటీవలి కాలంలో పరిశీలిస్తే వంద ప్రమాదాల్లో 70 ప్రమాదాలు బైకులవే. ప్రతి పది ప్రమాదాల్లో 8 దాకా మోటారు సైకిల్‌పై ప్రయాణించే వారివే ఉండటం ఆందోళన చెందాల్సిన విషయం. ఈ ప్రమాదంలో కూడా ఎక్కువ భాగం 35 ఏళ్లలోపు వారే మృతి చెందుతున్నారు. ఈ ప్రమాదాల ఘటనలన్నీ ఆందోళన కలిగిస్తుండగా.. వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ప్రమాదాలన్నీ ఎక్కువ శాతం అతివేగం, పరధ్యానం, డ్రంకెన్ డ్రైవింగ్, హెల్మెట్ ధరించకపోవడం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నట్లుగా పోలీసులు గుర్తించారు.



భయపెడుతున్న బైకులు

- 70 శాతం ప్రమాదాలు ద్విచక్ర వాహనాలవే..
- అతివేగం.. అవగాహన లోపమే కారణం
- దృష్టి సారించని పోలీసు శాఖ

కర్నూలు క్రైం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత ఏడాదిగా జరిగిన బైక్ ప్రమాదాలను గుర్తిస్తే.. అతివేగం, నిర్లక్ష్యంగా నడపడం వల్లనే 50 శాతం బైక్ ప్రమాదాలు జరిగినట్లుగా పోలీసుల లెక్కలు చెబుతున్నాయి. మద్యం, గంజాయి సేవించి డ్రైవింగ్ చేయడం వల్ల 20 శాతం ప్రమాదాలు జరిగాయి. మైనర్ డ్రైవింగ్ చేయడం వల్ల మరో 15 శాతం ప్రమాదాలు జరిగాయి. పరధ్యానం బ్రోవి ముందున్న రోడ్డును గుర్తించలేకపోవడం, మలుపులను గుర్తించకపోవడం, ఎదురుగా వచ్చే వాహనాలను అంచనా వేయలేకపోవడం, సడెన్‌బ్రేకులు వేయడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వంటివి మరో 15 శాతం ప్రమాదాలుగా ఉన్నాయి. ఈ ప్రమాదాల్లో హెల్మెట్‌లు ధరించి ఉంటే 25 శాతం ప్రాణాలతో బయటపడేవారని పోలీసులు చెబుతున్నారు.



గత ప్రమాదాలను పరిశీలిస్తే...

- ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో చిన్నటేకూరు వద్ద మూడు నెలల క్రిందట బైక్‌పై వెళ్తున్న తండ్రి కొడుకులు ప్రమాదం జరిగి తండ్రి మృతి చెందాడు. ఈ ప్రమాదానికి పోలీసు శాఖ తమదైన శైలిలో విశ్లేషించింది. డ్రైవింగ్ చేసుతన్న కొడుకు అతివేగంగా వెళ్లడం, మరోవైపు సరైన అవగాహన లేకపోవడం వల్లనే ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు.
- ఆదోని సమీపంలో పాండవగల్లు వద్ద జరిగిన ప్రమాదంలో రెండు మోటారు సైకిళ్లపై ప్రయాణిస్తున్న ఐదుగురు దుర్మరణం చెందారు. ఈ ప్రమాదంలో ఒకే బైక్‌పై ముగ్గురు ప్రయాణించడం, బస్సు డ్రైవర్ అతివేగం, మోటారు సైకిలిస్టుల్లో డ్రైవింగ్ చేస్తున్న అవగాహన లోపం, మలుపుల వద్ద ఎంత స్పీడుతో వెళ్లాలో తెలియకపోవడం, ఎదురుగా వస్తున్న వాహనాల వేగాన్ని అంచనా వేయలేకపోవడం కారణాలుగా పోలీసులు విశ్లేషిస్తున్నారు. అలాగే ఈ రెండు మోటారు సైకిలిస్టు కూడా ఒకరి పక్కన ఒకరు వెళ్తూ ఎదురుగా బస్సు వస్తున్న సమయంలో ఓవర్‌టేక్ చేస్తుండటం.. ఆర్టీసీ డ్రైవింగ్ క్రాస్ డ్రైవింగ్‌తోనే ప్రమాదం జరిగినట్లుగా పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఈ డ్రైవింగ్ చేసే వ్యక్తుల వద్ద కూడా ఎలాంటి డ్రైవింగ్ లైసెన్సు లేనట్లు పోలీసులు గుర్తించారు.
- మూడు నెలల కిందట ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో చిన్నటేకూరు గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటారు సైకిల్‌పై వెళ్తున్న యువకుడు మృతి చెందాడు. కోడుమూరు మండలానికి చెందిన ఆ యువకుడి సోదరి పెళ్లికి కుటుంబసభ్యులు అందరూ ముందుగా వెళ్లిపోగా.. ఆ యువకుడు ఇంటికి తాళం వేసి తనమిత్రులతో కలిసి బైక్‌పై బయలుదేరాడు. ఓ వైపు రాత్రి కావడం, మరో వైపు రోడ్డుపై అవగాహన లేకపోవడం, ముందుగా ఉన్న గుంతలను గుర్తించలేకపోవడంతో రోడ్డు మరమ్మతుల కోసం తవ్విన గుంతలో పడి మృతి చెందాడు. ఈ ఘటనతో ఆ ఇంట్లో పెళ్లి ఆగిపోయింది.
- కొత్తపల్లి మండలం శివపురం గ్రామ సమీపంలో బైక్ అదుపు తప్పి హరికృష్ణ యాదవ్ అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి జరిగింది. ఈయన మృతికి మద్యం తాగి వాహనం నడపడం వల్లే అని పోలీసుల ప్రాథమిక నిర్ధారణలో తేలింది.
- ఈ ఏడాది జనవరి 23న ఒక్కరోజే ఐదు మంది మృత్యువాత పడ్డారు. కర్నూలులో ఇద్దరు వృద్ధులు మృతి చెందగా.. ఉల్చాల రోడ్డులో ఓ మహిళ మృతి చెందింది. ఆస్పరి వద్ద ద్విచక్రవాహనం లారీని ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు, పెద్దకడుబూరు సమీపంలో హనుమాపురం వద్ద ద్వీచక్రవాహనాన్ని -కారు ఢీకొన్న సంఘటనలో మరో యువకుడు దుర్మరణం చెందాడు
- జనవరి 22న మంత్రాలయం సమీపంలో సూగూరు వద్ద ద్వీచక్రవాహనంలో చీర కొంగు ఇరుకుని కింద పడి మహిళ మృతి చెందింది.
- జనవరి 18న హుశేనాపురం, ఓర్వకల్లు మధ్యలో ఓ కుక్కను తప్పించబోయి ద్వీచక్రవాహనదారుడు దుర్మరణం చెందాడు.
- ఈ నెల 19న తుగ్గలి వద్ద ద్వీచక్రవాహనాన్ని లారీ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా.. మరోకరు గాయపడ్డారు.
- కర్నూలు నగరంలో ఈ నెల 13న ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపు తప్పి కింద పడి వంశీకృష్ణ అనే వ్యక్తి మృతి చెందాడు.
- జనవరి 2వ తేదీన కోడుమూరు రహదారిలో కొత్తూరు కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో దంపతులు రామగోవిందు, వరలక్ష్మి దుర్మరణం చెందారు.

నైపుణ్యం లేకపోవడమే



ఇటీవల జరుగుతున్న బైక్ ప్రమాదాల్లో నైపుణ్యం లేని వారు డ్రైవింగ్ చేయడం వల్లనే జరుగుతున్నాయి. సరైన డ్రైవింగ్ శిక్షణ తీసకోకపోవడం, తమ సామర్థ్యానికి మించి ఎక్కువ సామర్థ్యం కలిగిన వాహనాలను డ్రైవింగ్ చేయడం, డ్రంకెన్ డ్రైవ్ చేయడంతోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించారు. రోడ్డుపైన పూర్తి స్థాయి అవగాహన ఉండడం లేదు. రోడ్డుసైడున వెళ్లకుండా సగం రోడ్డు మధ్యలో వెళ్తుండటంతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించారు.

- మన్సూరుద్దీన్, ట్రాఫిక్ సీఐ

అవగాహన కల్పిస్తున్నా మారడం లేదు



ద్విచక్ర వాహనదారుల్లో రోడ్డు నిబంధనలపై ఎన్నిసార్లు అవగాహన కల్పిస్తున్నా వారిలో మార్పు రావడం లేదు. చాలా మందికి డ్రైవింగ్ లైసెన్సు ఉండడం లేదు. సరైన అవగాహన లేకపోవడం, నిర్లక్ష్యడ్రైవింగ్‌తో ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు.

- నల్లప్ప, సీఐ, ఆదోని రూరల్

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ప్రజల శాంతికి విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు: ఎస్పీ



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

కర్నూలు క్రైం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో సీఐలు, ఎస్ఐలు రౌడీషీటర్లకు, నేరచరిత్రగలవారికి, చెడునడవడిక కలిగిన వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో సంబంధిత సీఐలు, ఎస్ఐలు 584 మంది రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సబ్ డివిజన్ల వారిగా కర్నూలులో 199 మందికి, ఆదోనిలో 87, పత్తికొండలో 112, ఎమ్మిగనూరులో 186 మంది రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్లు నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

మంత్రాలయంలో పోటెత్తిన భక్తులు



మఠం ప్రాంగణంలో భక్తులు

మంత్రాలయం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం రద్దీగా మారింది. ఆదివారం సెలవు దినం కావటంతో దక్షణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. శనివారం నుంచి ఆదివారం రాత్రి వరకు భక్తుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నది తీరం భక్తులతో కోలాహలంగా మారింది. తుంగభద్ర నదిలో పుణ్య స్నానాలు ఆచరించి గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవాల ఊరేగింపులో పాల్గొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీస్సులు పొందారు.

క్షయ నివారణ సాధ్యమే

- ముందుగా గుర్తించి వైద్యం చేయించుకుంటే తగ్గుతుంది
- జిల్లా వ్యాప్తంగా 2024లో 3077 కేసుల నిర్ధారణ
- నేడు ప్రపంచ క్షయ నివారణ దినం

7

మంత్రాలయంలో న్యాయసుధ మంగళ ఉత్సవం

జగనన్నా.. న్యాయం చెప్పన్నా..!

- మున్సిపల్ చైర్‌పర్సన్ శాంతి ఆవేదన
- వాల్మీకి సంఘాల మద్దతు



మున్సిపల్ చైర్‌పర్సన్ శాంతకు మద్దతు తెలుపుతున్న వాల్మీకి సంఘం నాయకులు

ఆదోని టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): 'జగనన్నా.. నువ్వే న్యాయం చెప్పన్నా..' అన్న మాటలు ఏ సాధారణ మహిళనో అన్నవి కావు. వ్యాపార రంగంలో రెండో ముంబాయిగా పేరొందిన ఆదోని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత ఆవేదన ఇది. సొంతపార్టీ వైసీపీ తరపున గెలిచిన కౌన్సిలర్లు తనపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడంపై మున్సిపల్ చైర్‌పర్సన్ శాంత చేపట్టిన నిరసన దీక్ష ఆదివారం మూడో రోజుకు చేరుకుంది. మున్సిపల్ చైర్‌పర్సన్‌గానే కాకుండా కనీసం మహిళగా కూడా తనకు గౌరవం ఇవ్వకుండా తనపై ఇలా అవిశ్వాస తీర్మానానికి వైసీపీ నాయకులు, కౌన్సిల్ సభ్యులు సిద్ధం కావడం ఏమిటని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఏం తప్పు చేశానో చెప్పిన తర్వాతే తనపై అవిశ్వాసం ప్రవేశపెట్టాలని ఆమె డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా చైర్‌పర్సన్ శాంత చేపట్టిన నిరసన దీక్షకు ఆదివారం వాల్మీకి, బోయ సంఘం నాయకులు కలిసి మద్దతు ప్రకటించారు. అధ్యక్షుడు వీరేష్ మాట్లాడుతూ మున్సిపల్ కౌన్సిల్‌లో మెజారిటీ ఉన్న వైసీపీ సభ్యులు ఎలాంటి అవినీతి మరక లేని శాంతపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం సమంజసం కాదన్నారు. ఆమెకు న్యాయం జరిగే వరకూ తమ మద్దతు కొనసాగుతుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు సురేష్, చంద్ర, మహాదేవ, నాగరాజు, గణేకల్ కొండయ్య, చిన్న హరివానం శివరాముడు, జయరాం, రాంబీం నాయుడు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపాదికన రిజర్వేషన్ కల్పించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో బీసీ జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక బీసీ భవన్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మురళీమోహన్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందని, బీసీలకు పార్టీ పదవుల్లో నామినేటెడ్ పదవులు కేటాయించి న్యాయం చేయాలని కోరారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, ప్రచార కార్యదర్శి వేంపెంట రాంబాబు, రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర యాదవ్, నాయకులు బెస్త గ్యాస్ శ్రీనివాసులు, శకుంతల, భారతి, కురువ శ్రీనివాసులు, వాడాల నాగరాజు, పీజీ వెంకటేశ్, పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

జాతీయ బీసీ సంక్షేమ సంఘం కర్నూలు జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా ఉపాధ్యక్షుడిగా కుమ్మరి రామకృష్ణ, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా కుమ్మరి రాజేశ్వరి, జిల్లా కార్యదర్శిగా కె.శ్రీనివాసులు, కోశాధికారిగా కె.బజారన్న, జిల్లా సహాయ కార్యదర్శులుగా గిరిబాబు, రవికుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నాగార్జున, జిల్లా కార్యదర్శిగా రేణుక, ఉపాధ్యక్షులుగా బి.రాధ, లింగన్న ఎన్నికయ్యారు.



నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాన్ని అందజేస్తున్న నాగేశ్వరరావు యాదవ్

దారులన్నీ మల్లన్న వైపే..

ఉగాది ఉత్సవాలకు తరలివస్తున్న కన్నడిగులు







శ్రీశైలం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు జరిగే ఉగాది ఉత్సవాలకు కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు నిత్యం వేలాదిగా తరలివస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు పాదయాత్రగా వస్తూ తమ భక్తి ప్రపత్తులను చాటుకుంటున్నారు. వందల కిలోమీటర్ల దూరం నుంచి ప్రతి ఏటా ఉగాది రోజున శ్రీశైలానికి చేరుకుని భ్రమరాంబ మల్లికార్జున స్వామివారిని కర్ణాటక భక్తులు దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఆత్మకూరు నుంచి వెంకటాపురం, నాగలూటి, పెద్దచెరువు, భీముని కొలను, కైలా ద్వారం మీదుగా శ్రీశైలానికి దుర్భేధ్యమైన అడవులను సైతం లెక్కచేయకుండా వస్తున్నారు. శ్రీశైలానికి వస్తున్న కన్నడ భక్తులకు దేవస్థానం భీముని కొలను, కైలా ద్వారం వద్ద తాగునీరు, అల్పాహారం, వైద్యసదుపాయాలు కల్పిస్తోంది. వేల సంఖ్యలో భక్తులు తరలివస్తుండటంతో క్షేత్ర వీధులన్నీ రద్దీగా దర్శనమిస్తున్నాయి. కర్ణాటకతో పాటు మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు తరలివస్తున్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరుగుతుం దని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

చిన్న పిల్లలకు అత్యాధునిక వైద్యం

వైద్య సదస్సుకు హాజరైన 140 మంది డాక్టర్లు



రాయలసీమ వైద్య విజ్ఞాన సదస్సులో పాల్గొన్న చిన్న పిల్లల వైద్యులు

కర్నూలు హాస్పిటల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లల్లో ఒక్కోసారి అత్యవసర పరిస్థితులు ఏర్పడుతాయని, వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే అత్యాధునిక చికిత్సలు చేయాల్సి వస్తుందని చిన్న పిల్లల వైద్య నిపుణులు తెలిపారు. ఆదివారం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీడియాట్రిషియన్ కర్నూలు కిమ్స్ ఆధ్వర్యంలో వైద్య విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు రాయలసీమ ప్రాంతానికి చెందిన 140 మంది వైద్యులు హాజరయ్యారు. ఎక్స్‌ట్రా, కార్పొరియల్, థెరపీ, ఎక్మో, సీఆర్ఆర్‌టీ లాంటి పలు రకాల చికిత్సలను కర్నూలు కిమ్స్ వైద్యులు, చిన్న పిల్లల వైద్యులు వివరించారు. ఎక్మో అందించడంతోపాటు అందులో వస్తున్న అత్యాధునిక పరికరాలు కూడా అక్కడకు తీసుకువచ్చి వాటిపై ఎలా పని చేయాలో ఏపీఎంసీ కాన్ఫరెన్స్ పరిశీలకులు డా.జి. సుధాకర్, పీడియాట్రిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శి డా. విజయానందబాబు, డా. వీర రత్నాకర్ రెడ్డి తెలిపారు.

రైతుబజారులో వ్యాపారుల బండారం బట్టబయలు

తూనికలు, కొలతల శాఖ అధికారుల తనిఖీలో వెల్లడైన మోసాలు



తూనికలు, కొలతల శాఖ అధికారుల ఆకస్మిక తనిఖీ

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే వినియోగదారులకు తక్కువ ధరకే నాణ్యమైన కూరగాయలు అందిస్తున్న రైతుబజారుగా సీ క్యాంపు రైతుబజారుకు ఇప్పటి దాకా మంచి పేరు వచ్చింది. అయితే తెర వెనుక ఈ రైతుబజారులో కూరగాయల వ్యాపారులు వినియోగదారులు ఎంతగా మోసం చేస్తున్నారో ఆదివారం తూనికలు, కొలతల శాఖ అధికారుల తనిఖీల్లో బట్టబయలైంది. తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ విజయకుమార్‌తో పాటు ఎస్టేట్ అధికారి కళ్యాణమ్మ, హార్టికల్చర్ అసిస్టెంట్ శివకుమార్ తదితరులు ఆకస్మికంగా కూరగాయలు అమ్ముకుంటున్న వ్యాపారులను తనిఖీ చేశారు. వారి కాటాలను క్షుణ్ణంగా పరిశీలించారు. దాదాపు 20 మంది వ్యాపారులు తూకం రాళ్లు సక్రమంగా లేవని, కొత్తవి వాడడం లేదని నిగ్గు తేల్చారు. అదేవిధంగా మరో ఐదుగురు వ్యాపారుల కాటాలు తప్పుగా ఉన్నట్లు తనిఖీలో బయట పడింది. వారికి నోటీసులు అందించి, మరోసారి ఇలా జరిగితే బయటకు పంపుతామని ఎస్టేట్ అధికారి కళ్యాణమ్మ వారికి హెచ్చరికలు జారీ చేశారు.

పని భారమంతా కింది సిబ్బందిపైనే..

- ఉన్నతాధికారులు నామమాత్రంగానే సేవలందిస్తున్నారు
- రాష్ట్ర ఫెడరేషన్ చైర్మన్ సేవా నాయక్ ధ్వజం



కొత్తగా ఎన్నికైన కార్యవర్గంతో రాష్ట్ర ఫెడరేషన్ చైర్మన్ సేవా నాయక్

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్థక శాఖలో పని భారమంతా కింది స్థాయి సిబ్బంది మీదే పడుతోందని, ఈ విషయం ప్రభుత్వం గుర్తించాలని ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ బి. సేవా నాయక్ అన్నారు. ఆదివారం నగరంలోని వెటర్నరీ పాలిక్లినిక్ ప్రాంగణంలో ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్స్ ఫెడరేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా ఉద్యోగుల సర్వసభ్య సమావేశం ఫెడరేషన్ జిల్లా చైర్మన్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో మూగ జీవాలకు వైద్యసేవలు అందించేందుకు చేపట్టిన పథకాల్లో గ్రామస్థాయి సిబ్బంది ముఖ్యపాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఈ విషయంలో అధికారులు నామమాత్రంగా పని చేస్తూ అంతా తామే చేస్తున్నట్లు తప్పుడు లెక్కలు రికార్డుల్లో చూపుతున్నారని అన్నారు. సమావేశంలో పశుసంవర్థక శాఖలోని మూడు సంఘాలు వెటర్నరీ అసిస్టెంట్ సర్వీసు అసోసియేషన్, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్, వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యవర్గ పదవీ కాలం పూర్తయినందున ఈ సంఘాలకు కొత్తగా కార్యవర్గాలను ఎన్నుకున్నారు.

హోరాహోరీగా ఎక్సైజ్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ ఎన్నికలు

జిల్లా అధ్యక్షుడిగా వైవీ గిరిబాబు

కర్నూలు అర్బన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ కానిస్టేబుల్స్ అండ్ హెడ్ కానిస్టేబుళ్ల అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం హోరాహోరీగా సాగాయి. నగరంలోని జిల్లా అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో ఎన్నికల అధికారిగా సీఐ రాజేంద్రప్రసాద్, అబ్జర్వర్‌గా అసిస్టెంట్ సూపరిటెండెంట్ రాజేశఖర్‌గౌడ్ పర్యవేక్షణలో ఇరు వర్గాలకు చెందిన ఉద్యోగులు ఓటింగ్‌లో పాల్గొని ఓట్లు వేశారు. జిల్లా వ్యాప్తంగా 209 మంది ఉద్యోగులు ఉండగా 207 మంది హాజరై నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. గత దశాబ్ద కాలంగా జిల్లా అధ్యక్షుడి కొనసాగుతున్న ఓబిలేస్‌ను ఈ సారి ఉద్యోగులు ఓడించారు. నూతన అధ్యక్షుడిగా కానిస్టేబుల్ వైవీ గిరి బాబు కు 146 ఓట్లు వేసి గెలిపించారు. ఓబిలేష్‌కు కేవలం 60 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. వైవీ గిరిబాబుకు చెందిన ప్యానల్ మొత్తం సభ్యులు ఎన్నికవ్వడంతో ఉద్యోగులు సంబరాలు చేసుకున్నారు. జనరల్ సెక్రటరీలుగా పి.విజయకుమార్, పి.విరుపాక్షిరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా అబ్దుల్ మాలిక్, ట్రెజరర్‌గా కల్పనను ఎన్నుకున్నారు.

శ్రీశైల జలాశయం సందర్శన



డ్యామ్‌ను సందర్శిస్తున్న ఖజానా శాఖ డైరెక్టర్ మోహన్‌రావు

సున్నిపెంట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): శ్రీశైల జలాశాయాన్ని ఆదివారం ఖజానా శాఖ డైరెక్టర్ మోహన్‌రావు సందర్శించారు. మొదట సున్నిపెంటలోని సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకున్నారు. ఆయన వెంట జిల్లా ట్రెజరీ ఆఫీసర్ రామచంద్రారావు, రమణ, రసూల్, ప్రకాష్, లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు ఉన్నారు.

క్షయ నివారణ సాధ్యమే

- ముందుగా గుర్తించి వైద్యం చేయించుకుంటే తగ్గుతుంది
- జిల్లా వ్యాప్తంగా 2024లో 3077 కేసుల నిర్ధారణ
- నేడు ప్రపంచ క్షయ నివారణ దినం



కర్నూలు హాస్పిటల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): క్షయ ఒకప్పుడు ప్రమాదకర వ్యాధి. ఇప్పుడు అంత భయపడాల్సిన పని లేదు. సమర్థవంతమైన చికిత్స అందుబాటులో ఉంది. అయినా క్షయ పూర్తిగా నివారణ కావడం లేదు. ప్రపంచ ప్రజలను భయపెడుతున్న ప్రాణాంతక 10 వ్యాధుల్లో టీబీ ఒకటి. ప్రతి పది మందిలో నలుగురు టీబీ బారిన పడుతున్నారు. ఇది అంటువ్యాధి. ట్యూబర్ క్యూలోసిస్ అనే బ్యాక్టీరియా వల్ల వస్తుంది. ప్రతి ఏటా ప్రపంచ టీబీ నివారణ దినాన్ని డబ్ల్యూహెచ్‌వో నిర్వహిస్తోంది.

క్షయ రోగ నిర్ధారణ పరీక్షల్లో ఎక్స్‌రే ప్రధానం. స్పుటం టెస్టు కూడా చేస్తారు. జిల్లా వ్యాప్తంగా 29 ట్రూనాట్ యంత్రాల ద్వారా రోగ నిర్ధారణ పరీక్షలు చేస్తారు. వీటితో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కర్నూలు, నంద్యాల, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మైక్రో బయాలజీకి చెందిన సీబీనాట్ యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా నోట్ బుక్ తరహాలో ఉండే హ్యాండ్ ఎల్డ్ ఎక్స్‌రే మిషన్ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సహకారంతో సేవలు అందుబాటులోకి రానున్నాయి.

లక్షణాలు

క్షయ వ్యాధిని కొన్ని లక్షణాల ద్వారా గుర్తించవచ్చు. కనీసం 3 వారాలపాటు తీవ్రమైన దగ్గు, దగ్గినప్పుడు కఫం రావడం ప్రధాన లక్షణం. టీబీ వచ్చిన వారిలో విపరీతమైన దగ్గు, ఛాతిలో నొప్పి, తలనొప్పి, నీరసం, జ్వరం, అలసట, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం, చలివేయడం లక్షణాలు కనిపిస్తాయి.

జిల్లా పరిస్థితి..

జిల్లాలో చాపకింద నీరులా క్షయ విస్తరిస్తుంది. 2020లో జిల్లా జనాభా 22.92 లక్షలకు గాను 28,923 మంది టీబీ పరీక్షలు నిర్వహించగా.. 1974 కేసులు వెలుగు చూశాయి. 2024లో 24.54 లక్షల జనాభాకు 78,368 టెస్టులు చేయగా.. 3077 కేసులు వచ్చాయి. టెస్టుల సంఖ్య జనాభా సంఖ్య పెరిగిన నేపథ్యంలో టీబీ కేసులు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి.



సేవాభారతి మొబైల్ వాహనం ద్వారా సేవలు

క్షయ వ్యాధులను గుర్తించేందుకు అశ్విని హాస్పిటల్ అధినేత పల్మనాలిస్టు డా. శ్రీనివాసరెడ్డి జిల్లాలో సేవాభారతి మొబైల్ డయోగ్నస్టిక్ వాహనం ఏర్పాటు చేశారు. ప్రతిరోజు జిల్లాలో హైరిస్క్ టీబీ కేసులు ఉన్న ప్రాంతాలకు ఈ మొబైల్ వాహనం వెళ్లి అక్కడ రోగులకు ఎక్స్ రే తీసి కేసులు నిర్ధారణ అయితే రెఫరల్ కేంద్రాలకు పంపిస్తుంటారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు ఆర్థిక సాయం

క్షయ వ్యాధిగ్రస్తులకు చికిత్స సమయంలో నెలకు రూ.1000 పోషకాహారం కోసం కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుంది. ఇటీవలె రూ.500 ఉన్న ఈ సహాయాన్ని రూ.1000లకు పెంచింది. ప్రజల్లో క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించిన సిబ్బందికి రూ.500, మందులు మింగించిన పర్యవేక్షకులకు రూ.1000/రూ.1,500 పారితోషకాన్ని అందిస్తుంది. క్షయ వ్యాధి ఉన్న వారు 6 నెలలకు సరిపడే ఖరీదైన మందులు ఉచితంగా 6 నెలల వరకు ఇస్తుంది.

క్షయ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రజలు క్షయ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలి.. ప్రారంభ దశలోనే గుర్తిస్తే నివారణ సాధ్యమే. రాష్ట్రంలో క్షయ వ్యాధిని నిర్ధారించే పరీక్షలో కర్నూలులో మొదటి స్థానంలో ఉంది. వరల్డ్ టీబీ డే సందర్భంగా సోమవారం ర్యాలీ, సదస్సును ఏర్పాటు చేస్తున్నాం.

– డాక్టర్ ఎల్.భాస్కర్, డిస్ట్రిక్ట్ లెప్రసీ, ఎయిడ్ అండ్ టీబీ కంట్రోల్ ఆఫీసర్, కర్నూలు

టీబీ అంటు వ్యాధి



క్షయ అంటు వ్యాధి. ఇది దగ్గు ద్వారా ఇతరులకు వేగంగా వ్యాపిస్తుంది. ఇంట్లో టీబీతో బాధపడే వారికి మిగిలిన కుటుంబ సభ్యులు కొంత దూరంగా ఉండాలి. షుగర్, కిడ్నీ, హెచ్ఐవీ, వ్యాధులున్న వారికి టీబీ వ్యాధి వచ్చే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ కమ్మర వినోద్ ఆచారి, కన్సల్టెంట్ ఫల్మనాలజిస్టు, కర్నూలు మెడికవర్ హాస్పిటల్

మంత్రాలయంలో న్యాయసుధ మంగళ ఉత్సవం

పాల్గొన్న 13 మంది పీఠాధిపతులు



బంగారు పల్లకి ఊరేగింపులో పాల్గొన్న పీఠాధిపతులు



పాల్గొన్న వివిధ రాష్ట్రాల పండితులు

మంత్రాలయం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి సన్నిధానంలో శ్రీమన్ న్యాయసుధ మంగళ ఉత్సవం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. రెండు రోజులు పాటు మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకలో వివిధ మఠాలకు చెందిన 12 మంది పీఠాధిపతులు హాజరయ్యారు. వేదవ్యాసపూజ, బంగారు పల్లకి ఊరేగింపులో పాల్గొని ఇష్టాగోష్టి నిర్వహించారు. తొలిరోజు శ్రీమఠం ప్రాంగణం, ఊంజల మండపంలో 13 మంది పీఠాధిపతులు బంగారు సింహాసనంపై మధ్వాచార్యులు, శ్రీరాముల విగ్రహ ప్రతిమలు, గ్రంథాలను ఉంచి పూజలు చేశారు. అనంతరం రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి మఠాధిపతులు పూజలు చేసి హారతులు ఇచ్చారు. గురుసార్వభౌమ సంస్కృత విద్యాపీఠం పండితుల ఆధ్వర్యంలో ఇష్టాగోష్టి నిర్వహించారు. 12 ఏళ్లుగా చదివిన సంస్కృత న్యాయ సుధ గ్రంథాలను బోధించిన పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, పండిత కేసరి విద్వాన్ రాజా ఎస్‌గిరిరాజాచార్‌లు శ్రమించి బోధించడంపై పలువురు పీఠాధిపతులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ వేడుకలో పీఠాధిపతులు విద్యాశీర్ష తీర్థులు, సుజయనిధితీర్థులు, విద్యాసాగరతీర్థులు, విద్యావల్లభతీర్థులు, వేదవర్ధనతీర్థులు, ఈషప్రియతీర్థులు, విద్యేశతీర్థులు, అక్షోభ్యరామప్రియతీర్థులు, విద్యేంద్ర తీర్థులు, బన్నాంజే రాఘవేంద్రతీర్థులు, ఉడిపి వామనతీర్థులు పాల్గొన్నారు. వీరికి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో బండాచార్, ఎస్ఎస్ వెంకటేశాచార్, గయా రామాచార్, ఆనందతీర్థాచార్, గౌతమాచార్, సుజీంద్రాచార్, వాదిరాజాచార్, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేశ్ జోషీ, శ్రీపతాచార్, సురేష్ కోనాపూర్, ఐపీ నరసింహమూర్తి, అనంత పురాణిక్, డీఎం ఆనందరావు, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాషాచార్ తదితరులు పాల్గొన్నారు.

నేటితరం కళాకారులకు స్ఫూర్తి ప్రదాత 'వెల్దుర్తి'



కళాకారులను సత్కరిస్తున్న పత్తి ఓబులయ్య తదితరులు

కర్నూలు కల్చరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నేటితరం రంగస్థల నటులకు స్ఫూర్తిప్రదాతగా జిల్లాకు చెందిన వెల్దుర్తి వెంకట నరసా నాయుడు నిలిచిపోతారని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య కొనియాడారు. ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో దివంగత సీనియర్ కళాకారుడు వెల్దుర్తి వెంకట నరసా నాయుడు వర్ధంతిని నిర్వహించారు. వెల్దుర్తి చిత్ర పటానికి రంగస్థల నటులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పత్తి ఓబులయ్య మాట్లాడుతూ వెల్దుర్తి తన నటనతో, మధురమైన గాత్రంతో అలనాటి ఆంధ్ర శ్రోతలను ఉర్రూతలూరగించారన్నారు. ఆయన తర్వాత జిల్లాలో అటువంటి నటుడు లేరన్నారు. వెల్దుర్తి నటన, పద్యాలాపన అంశాలను నేర్చుకొని ఆధునిక పద్య గాయక నటులు రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి వెంక ట నరసానాయుడు మనుమడు వెంకట నాయుడు, సీనియర్ నటు లు హెచ్ చంద్రన్న, పి.రాజారత్నం, జీవీ శ్రీనివాసరెడ్డి, బాలవెంకటేశ్వర్లు, వీవీ రమణారెడ్డి, పి.హనుమంతరావు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన రామాంజనేయ యుద్ధం : అనంతపురానికి చెందిన విద్యార్థిని ధూపం తిరుమల తేజ శ్రీరామునిగా, విజయనగరం జిల్లాకు చెందిన బొబ్బిలి నాయుడు ఆంజనేయుడిగా నటించిన రామాంజనేయయుద్ధం నాటక ప్రదర్శన ప్రేక్షకులను అలరింపజేసింది. తిరుమల తేజ, బొబ్బిలి నాయుడులను టీజీవీ కళాక్షేత్రం సభ్యులు శాలువాలు, పూలదండలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. అదేవిధంగా కళాక్షేత్రం పక్షాన నగదుప్రోత్సాహకాన్ని అందజేశారు.

మిద్దెపై నుంచి పడి చిన్నారి మృతి

వందగల్లులో విషాదం



శ్రీదేవి (ఫైల్)

కోసిగి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని వందగల్లు గ్రామంలో లంక ఆంజనేయులు, నాగలక్ష్మీ దంపతుల మొదటి కుమార్తె శ్రీదేవి(4) ఆదివారం ఆడుకుంటూ ఇంటి మిద్దెపై నుంచి కింద పడి మృతి చెందింది. వివరాలివీ.. శ్రీదేవి తల్లిదండ్రుతలతో పాటు ఆడుకుంది. అయితే పది నిమిషాల వ్యవధిలోనే ఇంటి మిద్దె ఎక్కిపై నుంచి కింద పడింది. తలకు తీవ్రగాయాలు కావడంతో రక్తమ డుగులో ఉన్న కూతురుని తల్లిదండ్రులు కోసిగి ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. ముందుగానే 108 సిబ్బందికి ఫోన్ చేయగా.. కోసిగి ఆసుపత్రి వద్దే ఉన్న 108 సిబ్బంది రామకృష్ణ బాలిక శ్రీదేవికి ప్రథమ చికిత్స అందించారు. అప్పటికే ప్రథమ చికిత్స అందించేలోపే శ్రీదేవి మృతి చెందిందని వైద్యులు, 108 సిబ్బంది తెలిపారు. అయ్యో.. చిట్టి తల్లి నాలుగేళ్లకే వందేళ్లు నిండిపోయాయా.. తమ కళ్ల ముందే ఇంతసేపు బుడి బుడి అడుగులు వేస్తూ గజ్జలసవ్వడితో.. చిరునవ్వులతో తిరిగిన నీవు.. మమ్మల్ని వదిలి ఎలా వెళ్లిపోయావమ్మా అంటూ తల్లిదండ్రుల రోదనలు అక్కడున్న వారిని కంటతడి పెట్టించాయి. దంపతులకు 9 నెలల కూతురు కూడా ఉంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడు నుండి కొలిమిగుండ్లకు 16 ఏళ్ల కింద వలస వచ్చి చిరు వ్యా పారం చేసుకుంటూ జీవిస్తున్న మురుగేషన్(49) ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో కొలిమిగుండ్ల శాంతినగర్‌లో విషాదం నెలకొంది. మురుగేషన్ వ్యాపారం కోసం ప్లాస్టిక్ సా మాన్లు కొనడానికి తాడిపత్రికి వెళ్లి, మోటార్‌సైకిల్‌పై తిరిగి కొలి మిగుండ్లకు వస్తుండగా వెంకటి రెడ్డిపల్లె వద్ద ఎదురుగా నాప రాళ్ల ట్రాక్టర్ వచ్చి ఢీకొట్టింది. ట్రాక్టర్ తలపై నుండి వెళ్లడంతో తల నుజ్జునుజ్జుగా మారింది. దీంతో మురుగే ‌షన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన బతుకుదెరువు కోసం వలస వచ్చి, ప్లాస్టిక్ సామాన్లు, మంచాలు, గృహోపకరణాలు పల్లెల్లో విక్రయించేవాడు. మృతదేహాన్ని తమిళనాడుకు తరలించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సన్నిహితులు వెల్లడించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



బావన్న(ఫైల్)

గోనెగండ్ల, మార్చి 23(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండల పరిధిలోని వేముగోడు గ్రామానికి చెందిన బావన్న(35) అనే యువకుడు విద్యుదా ఘాతంతో మృతి చెందాడు. శనివారం సాయంత్రం వేముగోడు గ్రామం లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో వర్షం కురిసింది. గ్రామంలోని బావన్న ఇంటికి విద్యుత్ సరఫరా చేసే సర్వీస్ వైర్ తెగి పోయి మెట్లపై పడింది. రాత్రి భోజనం చేశాక ఇంటి మిద్దెపై పడుకు నేందుకు మెట్ల మీద బావన్న వెళుతూ తెగినపడిన సర్వీస్‌వైర్ తొక్కాడు. విద్యుతాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు.

కృష్ణా నదిలో మునిగి పదో తరగతి విద్యార్థి మృతి



కార్తికేయ జస్వంత్ మృతదేహం

సున్నిపెంట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం డ్యాం దిగువ కృష్ణా నదిలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థి నీట మునిగి మృతి చెందింది. ఆదివారం సెలవు దినం కావడంతో సున్నిపెంటకు చెందిన నలుగురు విద్యార్థులు తెలంగాణ ప్రాంతానికి చెందిన లింగాలగట్టు ప్రాంతంలో ఈతకు వెళ్లారు. అందులో కార్తికేయ జస్వంత్(17) అనే విద్యార్థి నీట మునిగి మృతి చెందాడు. సోమవారం పరీక్షకు వెళ్లాల్సిన విద్యార్థి మృతి చెందడం అందరినీ కలచివేసింది.

వంట గ్యాస్ పేలి ముగ్గురికి తీవ్ర గాయాలు

ఆలూరు రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఆలూరు మండల పరిధిలోని కురవల్లి గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున వంట గ్యాస్ సిలిండర్ పేలి ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. గ్రామంలో రైతులు తెల్లవారు జామున ట్రాక్టరులో పశుగ్రాసం తెచ్చేందుకు వెళుతుండగా వారికి వంట గ్యాస్ వాసన వచ్చింది. దీంతో ఇంట్లో నిద్రపోతున్న గాయత్రి, గురుస్వామి దంపతులను లేపి ఇంట్లో నుంచి గ్యాస్ వాసన వస్తోందని తెలిపారు. నిద్ర నుంచి లేచిన గురుస్వామి అగ్గిపుల్ల గీయడంతో ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చింది. ఇద్దరు దంపతులతోపాటు ఎనిమిదేళ్ల కొడుకు ధర్మకు తీవ్ర గాయాలు కావడంతో ఆదోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వారి ఇంటి గోడల పైకప్పు కూలిపోయింది. క్షతగాత్రులను ఆలూరు టీడీపీ యువ నాయకుడు గిరి మల్లేష్ గౌడ్ పరామర్శించారు. బాధితులకు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఉప్పర రవి, టీడీపీ నాయకులు ఈరప్ప, కేశన్న, మల్లయ్య, రామేష్ ఉన్నారు.

సంజన్న హత్య కేసులో మరో నిందితురాలి అరెస్టు

కర్నూలు క్రైం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శరీన్‌నగర్‌లో జరిగిన సంజన్న హత్య కేసులో మరో నిందితురాలు వడ్డె సావిత్రమ్మను పోలీసులు అరెస్టు చేశారు. ఇప్పటికే ఈ కేసులో అంజితో పాటు అతని కొడుకులు వీరి అనుచరుడు అశోక్‌ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అంజి భార్య సావిత్రమ్మ కూడా ఈ హత్య కేసులో ప్రమేయం ఉన్నట్లు నిర్ధారణ కావడంతో ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ మధుసూదన్‌గౌడు తెలిపారు.

మున్సిపల్ కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): నగరంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని 26న చేపడుతున్న మున్సిపల్ కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయాలని సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎండీ.షరీఫ్ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని పలు ప్రాంతాలలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నగరానికి తాగునీటి సమస్య పరిష్కారానికి మరో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మించాలన్నారు. హైదరాబాద్ ఎన్టీఆర్ గార్డెన్ తరహాలో జొహరాపురంలని డంప్ యార్డు స్థలంలో మెగా పార్కు నిర్మించాలన్నారు. 42,43 వార్డులలో సీపీఎం అధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించార కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ దేశాయ్, రామక్రిష్ణ కే.అరుణ, భాస్కర్, సుజాత, సావిత్రమ్మ పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించిన వారిని అరెస్టు చేయాలి


మాట్లాడుతున్న ఆనంద్‌బాబు

కర్నూలు న్యూసిటీ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దూబచర్ల గ్రామంలో అంబేడ్కర్‌ను అవమానించిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం పాతబస్టాండు అంబేడ్కర్ విగ్రహనికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు విజయమ్మ, నాయకులు చక్రపాణి, వెంకటేశ్వర్లు, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం

- వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి


మాట్లాడుతున్న వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి

కర్నూలు కల్చరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో 200 ఏళ్ల చరిత్ర కలిగిన వన్‌టౌన్‌లోని పేట శ్రీరామాలయంలో నిర్వహించనున్న శతాబ్ది బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు నగర భక్తులంతా ముందుకు రావాలని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని షరాఫ్‌బజార్‌లోని వేంకటాచలపతి కల్యాణ మంటపంలో ఆయన మాట్లాడుతూ ఈ రామాలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభించి 99 ఏళ్లు అయ్యాయని, ఈ ఏడాది 100 ఏళ్లు పూర్తయి, శతాబ్ది బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు మాళిగి హనుమేషాచార్యులు మాట్లాడుతూ ఏప్రిల్ 12 నుంచి 18 వరకు ఆలయంలో శతాబ్ది బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఏప్రిల్ 16న ఉదయం 10 గంటలకు సీతారామ కల్యాణోత్సవం, సాయంత్రం 5 గంటలకు దివ్య మంగళ రథోత్సవం ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో లలితీ పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి, వీహెచ్‌పీ నాయకులు ఎస్ ప్రాణేశ్, నీలి నరసింహ, భానుప్రకాశ్, డాక్టర్ సీఏ నగేశ్ లతోపాటూ వివిధ కులసంఘాలు, ఆలయాలు, ఆధ్యాత్మిక కేంద్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీశైలం పాదయాత్ర భక్తులకు అన్నదానం


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చిన్మయ మిషన్ ఇన్‌చార్జి మాతా సుప్రేమానంద తదితరులు

కర్నూలు కల్చరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ కర్నూలు రోటరీ క్లబ్, రోటరీ క్లబ్ అనుబంధ సంస్థ ఇన్నర్ వీల్ క్లబ్ కర్నూలు (మహిళా విభాగం) ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం శ్రీశైలం వెళుతున్న కన్నడ ప్రాంత పాదయాత్ర భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలో కేసీ కెనాల్ సమీపంలో, సప్తగిరినగర్‌లోని కొత్త అయ్యప్ప స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని చిన్మయ మిషన్ కర్నూలు సెంటర్ ఇన్‌చార్జి మాతా సుప్రేమానంద, 17వ వార్డు కార్పొరేటర్ క్రైప పద్మలతారెడ్డి, డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ విజయలక్ష్మమ్మ హాజరై ప్రారంభించారు. ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు శిరీష, కార్యదర్శి ఉష, పూర్వ అధ్యక్షురాలు శారదాదేవి, సభ్యులు వసుంధర, దేవి తదితరలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ జోనల్ అధికారి, వీఆర్ ఆసుపత్రి అధినేత డాక్టర్ వాసురెడ్డి సౌజన్యంతో ఉచిత వైద్య పరీక్షల శిబిరం ఏర్పాటు చేశారు. రోటరీ క్లబ్ జోనల్ అధికారులు టీఎస్ విజయకుమార్, ఎన్ హరినారాయణ, నూగూరు వెంకటేశ్వర్లు, సభ్యులుప్రకాశ్‌రావు, ఆర్‌వీ బ్రహ్మయ్య, మురళీకృష్ణ, జితేంద్ర, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

ఓర్వకల్లు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని అడల్ట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఉల్లాస్ వయోజన విద్య అక్షరాస్యతపై రెండు నెలలు శిక్షణ పొందిన మహిళలకు మండలంలోని అన్ని గ్రామాల్లో పరీక్షలు నిర్వహించారు. మండలంలోని హుశేనాపురం, పాలకొలను గ్రామాల్లో జరుగుతున్న కేంద్రాలను చంద్రశేఖర్ రెడ్డితో పాటు సూపర్‌వైజర్ నిమలయ్య పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకట్రామిరెడ్డి, వాలంటీర్లు, టీచర్లు పాల్గొన్నారు.

ఘనంగా భగత్‌సింగ్ వర్ధంతి

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఏఐడీఎస్‌వో, ఏఐడీఎస్‌వో, ఏఐఎంఎస్ఎస్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సర్దార్ భగత్‌సింగ్ వర్ధంతిని ఆదివారం స్థానిక పాత కంట్రోల్ రూం వద్ద భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజీలేని స్వాతంత్ర సమరయోధుడు అమరవీరుడు భగత్‌సింగ్ అని విద్యార్థి సంఘాల నాయకులు కొనియాడారు. స్వాతంత్ర ఉద్యమ కాలంలో భగత్‌సింగ్ దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితులను అర్థం చేసుకోవడమే గాక, భవిష్యత్తులో ఏర్పడవలసిన వ్యవస్థ గురించి స్పష్టమైన అవగాహన కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐడీఐవో రాష్ట్ర ఇన్‌చార్జి డి.రాఘవేంద్ర, ఏఐడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షులు హరీష్ కుమార్ రెడ్డి, ఏఐఎంఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.తేజోవతి పాల్గొన్నారు.

కర్నూలు న్యూసిటీ: భారతదేశ యువకెరటాలు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు అని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం అన్నారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ అధ్వర్యంలో ఆదివారం భగత్ సింగ్,రాజ్‌గురు, సుఖదేవ్‌ల 94వ వర్ధంతిని పురస్కరించుకుని వారి చిత్రపటాలకు పూలమాలల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, చంద్రశేఖర్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

● సామ్రాజ్యవాదానికి, మతోన్మాదానికి వ్యతిరేకంగా యువత పోరాటాల్లోకి రావాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ పిలుపునిచ్చారు. శ్రీరామ్ నగర్‌లో,శరీన్‌నగర్,ముజఫర్ నగర్‌లో భగత్ సింగ్,రాజ్‌గురు, సుఖదేవ్‌ల 94వ వర్ధంతిని పురస్కరించుకుని వారి చిత్రపటాలకు పూలమాలల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యూసిటి కార్యదర్శి హుస్సేన్, హేమంత్, నరేంద్ర, విజయ్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

● మతోన్మాద, కార్పొరేట్ కబంధ హస్తాల నుంచి దేశాన్ని కాపాడుకుందామని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు పిలుపునిచ్చారు. జొహరాపురం షడక్ నగర్‌లో భగత్ సింగ్,రాజ్‌గురు, సుఖదేవ్‌ల 94వ వర్ధంతిని పురస్కరించుకుని వారి చిత్రపటాలకు పూలమాలల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రంగస్వామి, నాగరాజు, వేనమ్మ, రమణ, తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

ఓర్వకల్లు: ప్రభుత్వం పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర కోరారు. ఆదివారం మండలంలోని కేతవరం గ్రామంలో భగత్‌సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా గ్రామ కార్యదర్శి నరేష్ అధ్యక్షతన ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపుకు డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న, సీఐటీయూ మండల కార్యదర్శి శ్రీధర్, డీవైఎఫ్ఐ గ్రామ కమిటి నాయకత్వం ఆధ్వర్యంలో అమీలియో హస్పిటల్ సిబ్బంది అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది డా.రమాదేవి, డా.ఆసియా, మేనేజర్ ప్రాణేష్, డీవైఎఫ్ఐ గ్రామ కమిటీ నాయకులు శేషాద్రి, భరత్, మధు, త్యాగరాజు, బుగ్గరాముడు, నాగమ్మ పాల్గొన్నారు.


భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కర్నూలు అర్బన్: నిజమైన దేశభక్తుడు భగత సింగ్ అని ఎస్ఎఫ్ఐ వర్శిటీ కార్యదర్శి రామక్రిష్ణ అన్నారు. ఆదివారం రాయలసీమ యూనివర్సీటీలో భగత్ సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు మౌలాలీ, రాజు, సాగర్, నవీన్, రతీశ్, జయరాజు పాల్గొన్నారు.

● భగత్ సింగ్, రాజుగుర్ , సుఖదేవుల స్ఫూర్తితో దోపిడీ లేని సమాజానికి పోరాడాలని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థిసంఘం రాష్ట్ర అధ్యక్షులు కే. భాస్కర్ అన్నారు. ఆదివారం రాయలసీమ యూనివర్సిటీలో భగత్‌సింగ్ 94వ వర్ధంతి సభ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వర్శిటీ నాయకులు రఘు, జిల్లా ఉపాధ్యక్షులు రమణ, దామోదర్, స్వరూప్, మెహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు: స్థానిక సీపీఐ కార్యాయలంలో ఏఐఎస్ఎఫ్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా దేశ స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలను అర్పించిన నాయకుల చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రంగస్వామి,విద్యార్థి సంఘం నాయకులు శ్రీరాములు, వీరాంజనేయులు, సీపీఐ నాయకులు మాధవ స్వామి, విశ్వనాథ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.




కోడుమూరులో నివాళి అర్పిస్తున్న నాయకులు



కర్నూలు అర్బన్ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో భగత్ సింగ్‌కు నివాళి

అభివృద్ధిని అడ్డుకోకండి..సహకరించండి

● తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోండి
● కల్లూరు జనరల్‌బాడీ సమావేశంలో ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను అడ్డుకోవద్దని..స్థానిక సంస్థల నాయకులు సహకరించాలని ఎమ్మెల్యే గౌరు చరిత ఆదేశించారు. ఆదివారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బి.శారద అధ్యక్షతన చేపట్టిన జనరల్‌బాడీ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డి.రామాంజనేయులు హాజరయ్యారు. ముందుగా మండల అధికారులు మూడు నెలల్లో చేపట్టిన ప్రగతి నివేదికలు సభకు చదివి వినిపించారు. ఈ సందర్భంగా గౌరుచరిత మాట్లాడుతూ పల్లెపండుగ కార్యక్రమంలో దాదాపు రూ.3.60 కోట్లతో గ్రామీణ రహదారుల బాగు చేశామన్నారు. అర్హులైన రైతులకు గోకులంషెడ్లు మంజూరయ్యాయని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీఎం చంద్రబాబు అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారని సూపర్‌సిక్స్ పథకాలు తప్పకుండా అమలు చేసి తీరుతామని గౌరు చరిత అన్నారు. ముఖ్యంగా వేసవికాలంలో గ్రామాల్లో త్రాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం లబ్ధిదారులకు అందించే అదనపు సహాయాన్ని బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం ఎంపీపీ శారద మాట్లాడుతూ పర్ల, యాపర్లపాడు, ఉలిందకొండ గ్రామాల్లో నీటి సమస్య అధికంగా ఉందని అధికారులు స్పందించాలని కోరారు. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులు పంచాయతీ అనుమతి లేకుండానే జరుగుతున్నాయని ఈవిషయంపై కోర్టుకు వెళ్లినట్లు సల్కాపురం సర్పంచు బి.మద్దిలేటి సభకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.నాగశేషాచలరెడ్డి, మండల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత

30న వల్లెలాంబదేవి రథోత్సవం



కోడుమూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హంద్రీనది తీరంలో వేలసిన వల్లెలాంబదేవి అమ్మవారి దివ్య మంగళ రథోత్సవ వేడుకలు 30న నిర్వహించనున్నారు. ఉగాది పండుగ పురస్కరించుకొని అమ్మవారి ఉత్సవ వేడుకలను 29న క్రోధి నామ సంవత్సరం ఫాల్గుణ శనివారం ఉదయం గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, గంగపూజ కార్యక్రమం చేపట్టనున్నారు. సాయంత్రం 7గంటలకు ప్రభోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. 30న ఉదయం రథాంగ హోమం, సా యంత్రం 6గంటలకు అమ్మవారి రథోత్సవ వేడుకలు చేపనున్నారు. 31న ఉదయం 10గంటలకు పారువేట, వసంతోత్సంతో అమ్మవారి ఉత్సవాలు ముగియనన్నాయని ఆలయ చైర్మన్, జడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి తెలిపారు.

ఎస్సీకాలనీకి రక్షణ కల్పించండి

కల్లూరు, మార్చి 23:(ఆంధ్రజ్యోతి): 36వ వార్డు పెద్దపాడు వడ్డేని వంక వరద నుంచి సమీపంలోని ఎస్సీ కాలనీ ప్రజలకు కాపాడాలని సిపిఎం న్యూసిటీ కార్యదర్శి టి.రాముడు డిమాండ్ చేశారు. ఆదివారం గ్రామ సిపిఎం కార్యదర్శి గోపినాథ్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఆయన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెద్దపాడులో వడ్డేనివంక ఆక్రమణకు గురైందని, వర్షాకాలంలో వరద నీటితో ఎస్సీ కాలనీ ప్రజలు సర్వం కోల్పోతున్నారుని ఆరోపించారు. గత పది సంవత్సరాలు క్రితం కర్నూలు కార్పొరేషన్‌లో విలీనమైన పెద్దపాడును అభివృద్ధి చేయాలని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, యేసురాజు, పరుశురాముడు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

నేడు నగర పాలకలో వినతుల స్వీకరణ

కర్నూలు న్యూసిటీ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): నగర పాలక కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులను స్వీకరించనున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం తెలిపారు. నగరంలో ఎక్కడైనా కాలనీల్లో స్థానిక సమస్యలు ఉంటే అర్జీ ఇవ్వాలని ఆయన కోరారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నగర పాలక కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ఇఫ్తార్

కర్నూలు న్యూసిటీ , మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ సందర్బంగా స్థానిక నగరంలోని రాయల్ పంక్షన్ హాలులో ముస్లింలు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకు మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు మోయిజ్‌ఖాన్, సీపీఎం నాయకులు పుల్లారెడ్డి, మాజీ చైర్మన్లు హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో పాల్గొన్న హఫీజ్‌ఖాన్, కాటసాని రాంభూపాల్ రెడ్డి

అనంతరం హాజరైన అతిథులకు ముస్లీం నాయకులు, వైసీపీ కార్యకర్తలు, అభిమానులు ఘనంగా శాలువతో సత్కరించి ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో ముస్లీం మత పెద్దలు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఫరూక్‌ను పరామర్శించిన కుడా చైర్మన్

కర్నూలు అర్బన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు పరామర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో ఆయన సతీమణి షహనాజ్ మృతిపై అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యంచెప్పి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.




జగన్నాథ గట్టుపై ఎస్పీ దంపతుల పూజలు


సంగమేశ్వర క్షేత్రంలో స్వామివారి తీర్థం స్వీకరిస్తున్న ఎస్పీ దంపతులు

కర్నూలు కల్చరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని జగన్నాథ గట్టుపై వెలసిన శ్రీ ఉమా సమేత రూపాల సంగమేశ్వర స్వామి క్షేత్రంలో ఆదివారం సాయంత్రం ఎస్పీ విక్రాంత్ పాటిల్, 2వ ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్ దంపతులు పూజలు నిర్వహించారు. గట్టుపై నిర్మించిన అతిపురాతన ఈ క్షేత్ర విశేషాలను వారు అడిగి తెలుసుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు సురేష్ కుమార్ శర్మ పూజాదికాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో వై. గుర్రెడ్డి, తాలూక సీఐ శ్రీధర్ పాల్గొన్నారు.

పాఠశాల కరస్పాండెంట్లు ఐకమత్యంగా ఉండాలి

● ఆపుస్మా రాష్ట్ర సలహాదారుడు జి.పుల్లయ్య


మాట్లాడుతున్న పుల్లయ్య

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల కరస్పాండెంట్లు ఐక్యమత్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు పాఠశాలల యజమాన్యం సంఘం (ఆపుస్మా) రాష్ట్ర గౌరవసలహాదారుడు జి.పుల్లయ్య తెలిపారు. ఆదివారం స్థానిక సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసెప్ పాఠశాలలో ఏపీ ప్రైవేటు పాఠశాలల యజమాన్యల సంఘం జిల్లా జనరల్ బాడీ సర్వసభ్య సమావేశం సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జనార్దన్ రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. జి.పుల్లయ్య మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాలల కరస్పాండెంట్లు ప్రావిడెంట్ ఫండ్లు, ఈఎస్ఐలను రెగ్యులర్‌గా చెల్లించాలని తెలిపారు. అలాగే పాఠశాలల యువ కరస్పాండెంట్లు, సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ప్రైవేటు పాఠశాలల యజమాన్యాల సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎస్.శ్రీనివాస రెడ్డి, సంఘం జిల్లా గౌరవసలహాదారుడు పీబీవీ సుబ్బయ్య, మాంటిస్సోరి పాఠశాలల డైరెక్టర్ రాజశేఖర్, యు.నటరాజ్, కర్నూలు నగరం అధ్యక్షులు యుగంధర్, జనరల్ సెక్రటరీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రేపు సామూహిక భగవద్గీత పారాయణం

కర్నూలు కల్చరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని స్వామి విద్యా ప్రకాశానంద గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం 'పాప విమోచన ఏకాదశి' సందర్భంగా సామూహిక సంపూర్ణ భగవద్గీత పారాయణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు డీవీ రమణ తెలిపారు. నగరంలోని సంకల్‌బాగ్‌లోగల గీతా ప్రచార ధామం సమావేశ హాలులో ఉదయం 9.30 గంటలకు సంపూర్ణ భగవద్గీత పారాయణ యజ్ఞం ప్రారంభమవుతుందని తెలిపారు.

విద్యతో పాటు క్రీడలు అవసరం



క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు అందజేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు స్పోర్ట్స్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు క్రీడలు అవసరమని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.బి.శంకర్‌శర్మ అన్నారు. నగరంలోని కొండారెడ్డిబురుజు సమీపంలోని కేఎంసీ పార్కులో తైక్వాండో బెల్టు గ్రేడింగ్ టెస్టును ఆయన ప్రారంభించారు. తైక్వాండో, మార్షల్ ఆర్ట్స్‌తో క్రమశిక్షణ, దేహదారుఢ్యం అభివృద్ధి కలుగునన్నారు. అనంతరం క్రీడా అతిథులు స్పోర్ట్స్ కిట్స్, టోపీలు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో తైక్వాండో కోచ్ వెంకటేశ్వర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పూడికతీత వ్యర్థాలను తొలగించాలి


పూడికతీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): నగరంలో మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టిన అనంతరం వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన సి.క్యాంపు, ఎస్ఆర్‌పేట, దామోదరం సంజీవయ్య కూడలి ప్రాంతాలలో పర్యటించారు. ప్రతి రెండు వారాలకు ఒక్కసారి తప్పనిసరిగ్గా ప్రతి వీధి చివరి వరకు పూడికతీత పనులను పకడ్బందీగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డా.కే.విశ్వేశ్వరరెడ్డి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి మాలల సంపూర్ణ మద్దతు

● మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పిడతల వెంకటస్వామి


మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు పిడతల వెంకటస్వామి

కర్నూలు న్యూసిటీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వానికి మాలలు సంపూర్ణ మద్దతు ఉంటుందని మాల మహనాడు జాతీయ అధ్యక్షుడు పిడతల వెంకటస్వామి స్పష్టం చేశారు. ఆదివారం బిర్లా కాంపౌండు జగదీష్ మాల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి డైరెక్షన్‌లో జూపూడి ప్రభాకర్, హర్షకుమార్‌లో పని చేస్తున్నారని ఆరోపించారు. భారతరాజ్యాంగం, మాలల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఇద్దరు పార్టీలకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం మాలలన ఉరాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి దూరం చేయాలని చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. సమావేశంలో జామల చిన్న సుంకన్న, బరిగెల నాగరాజు, వరప్రసాద్, ఎం.హరిక్రిష్ణ, ఎం.అద్భుత కుమార్, ఎం.చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి : కేఈ ప్రభాకర్

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్ మార్చి 23 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సంస్థలు తమ వంతు బాధ్యతగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించినప్పుడే సమాజంలో అన్ని వర్గాల అభ్యున్నతి సాధ్యమని మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ అన్నారు. ఆదివారం నగరంలోని స్థానిక ఎర్రబురుజులో జైభీమ్ జనశక్తి సంస్థను ఆయన ప్రారంభించారు. కేఈ ప్రభాకర్ మాట్లాడుతూ పేదలకు నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందించినప్పుడే సమ సమాజ నిర్మాణం జరుగుతుందని, ఆ దిశగా జైభీమ్ జనశక్తి సంస్థ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జైభీమ్ జనశక్తి సంస్థ ప్రతినిధులు జె.శ్రీనివాసులు, వి.కిరణ్‌కుమార్, అర్జున్, బాబు, బాలక్రిష్ణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి కేఈ ప్రభాకర్

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం



కరపత్రాలను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

ఆదోని అగ్రికల్చర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రజా సమస్యల పట్ల పురపాలక అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న అన్నారు. ఈ నెల 26 తల పెట్టిన ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలో పట్టణంలోని పలు వార్డుల్లో ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారని అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి నెలలైనా అభివృద్ధిపై శ్రద్ధ పెట్టడం లేదన్నారు. ఈ నెల 26న మున్సిపల్ కార్యాలయం ముట్టడిలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఎస్ గోపాల్, ముక్కన్న, తిప్పన, వీరేష్, నాగరాజు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ అభినందనీయం



మాట్లాడుతున్న డీఎస్పీ మర్రిపాటి హేమలత

ఆదోని అగ్రికల్చర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పేద ముస్లిం మైనార్టీ మహిళలకు రంజాన్‌తోఫా పంపిణీ చేయడం అభినందనీయమని డీఎస్పీ మర్రిపాటి హేమలత అన్నారు. ఆదివారం బిస్మిల్లా ఫంక్షన్ హాల్‌లో సోషల్ వర్కర్ నూర్ 200 మందికి రంజాన్ తోఫాను డీఎస్పీ హేమలత, టూ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక సేవలో నేటి యువత ముందుండడం స్ఫూర్తిదాయకమన్నారు. పేదలకు సహాయం చేయడమే నిజమైన రంజాన్ అన్నారు. మహిళలు తప్పకుండా తమ పిల్లలను చదివించాలని సూచించారు. కార్యక్రమంలో జర్నలిస్టు హుస్సేన్ భాష, సోషల్ వర్కర్ నూర్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



ప్రవీణ్‌ను సన్మానించిన దృశ్యం

ఆలూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఆలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన సి ప్రవీణ్ కుమార్‌ను ఆదివారం సన్మానించారు. ఆదివారం జరిగిన నామినేషన్ల ఉపసంహరణలో అధ్యక్ష పదవికి సీనియర్ న్యాయవాది వాయుజీవోత్తం రావ్ నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో ప్రవీణ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యా ఎన్నికల అధికారి రాజేష్ నాయుడు తెలిపారు. అలాగే ఉపాధ్యక్షులుగా ప్రసాద్ రావ్, కార్యదర్శిగా జి షాకీర్ బాషా, కోశాధికారిగా చాంద్ బాషాలు కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సీనియర్ న్యాయవాదులు లక్ష్మీకాంత్, షేక్షావలి, వీరేష్, రవి, విజయ్ భాస్కర్‌లు, మాజీ సర్పంచ్ రంగస్వామి, టీడీపీ నాయకులు సీనప్ప, కురువ హనుమప్పలు వారిని అభినందించారు.

రైతులను ఆదుకోవాలి

హాలహర్వి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): హంద్రీ నీవా కింద సాగు చేసిన రైతులను ప్రభుత్వం సాగు నీరు ఇచ్చి ఆదుకోవాలని ఎమ్మెల్యే విరుపాక్షి డిమాండ్ చేశారు. ఆదివారం చింతకుంట గ్రామంలో సాగు నీరు లేక ఎండిన వరి పంటలను ఆయన పరిశీలించి రైతులను పరామర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం రైతుల పట్ల వివక్షత చూపుతోందని, దేశానికి అన్నం పెట్టే అన్నదాతకు అండగా లేకపోవడం దారుణం అన్నారు. అనంతరం గూళ్యం విద్యుదాఘాతంతో మృతి చెందిన గోవర్ధన్ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు అర్థగిరి శ్రీనివాసులు, రామ్ రెడ్డి వన్నూరప్ప పాల్గొన్నారు.

అభ్యాసకులకు ఉల్లాస్ పరీక్ష



ఉల్లాస్ పరీక్ష రాస్తున్న అభ్యాసకులు

దేవనకొండ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 3200 మంది అభ్యాసకులు ఫౌండేషనల్ లిటరసి అండ్ న్యూమరసి అసెస్మెంట్ టెస్ట్ (ఉల్లాస్)పరీక్ష రాశారు. మండలంలోని 44 గ్రామాల పరిధిలో ఎన్ఐఓఎస్ పరీక్ష అంగన్‌వాడీ టీచర్ల సమక్షంలో నిర్వహించినట్లు వెలుగు ఏపీఎం నర్సన్న తెలిపారు. పరీక్షలు ఉత్తీర్ణులైన వారికి ఐదో తరగతి సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. చదువురాని నిరక్షరాసులకు విద్యనందించడమే ఉల్లాస్ ధ్యేయమన్నారు.

ఎస్టీ జాబితా అంశంపై ఒత్తిడి తేవాలి

ఆలూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ అంశంపై ప్రస్తుత ముఖ్యమంత్రిపై ఒత్తిడి తీసుకు రావాలని మాజీ జడ్పీటీసీ రాంభీం నాయుడు కోరారు. ఆదివారం ఆలూరులో మాజీ మంత్రి, గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను కలిశారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి మార్పు చేసి చిరకాల కోరికను నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకులంగా ఉన్నారని జయరాం తెలిపారు. కార్యక్రమంలో హనుమన్న, ములుగుందం, వాల్మీకి నాయకులు హనుమంతు, నర్సన్న పాల్గొన్నారు.





భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, భగత్ సింగ్ చిత్రపటానికి డీవైఎఫ్ఐ నాయకుల నివాళి

భగత్‌సింగ్ పోరాటం
స్ఫూర్తిదాయకం



దేవనకొండలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఆదోని అగ్రికల్చర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): భగత్ సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ అన్నారు. ఆదివారం భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 94వ వర్ధంతిని డీవైఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌వో నాయకులు వేరువేరుగా జరుపుకున్నారు. ముందుగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ మాజీ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ పట్టణ అధ్యక్షుడు వీరేష్ మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా, దోపిడీ పీడన అణిచివేత లేని సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం భగత్ సింగ్ పోరాడారన్నారు. కార్యక్రమంలో మోహన్ రాజు, చాంద్ నాగరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

● **పత్తికొండ టౌన్:** పత్తికొండ పట్టణంలో ఆదివారం భగత్‌సింగ్ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్టు హౌస్ నుంచి పట్టణ పురవీధుల గుండా విద్యార్థి యువజన సంఘాల నాయకులు, కార్యకర్తలు కాగడాల ప్రదర్శన నాలుగు స్తంభాల కూడలి వరకు నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి రాజాసా హెబ్ మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్యవాదులను దేశం నుంచి తరిమికొట్టేందుకు అతి చిన్న వయస్సులోనే పోరుబాట పట్టిన భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖ్‌దేవ్‌ల ఉద్యమ స్ఫూర్తిని మరువలేమని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, ఏఐవైఎఫ్ నాయకులు కారుమంచి అల్తాఫ్, నజీర్, సురేంద్ర, కారన్న, ఈరన్న, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ: భగత్‌సింగ్ ఆశయం యువతకు స్ఫూర్తిదాయకమని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శరత్‌కుమార్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో భగత్‌సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. దేశ స్వాతంత్రం కోసం బ్రిటీష్ పరాయి పాలనకు వ్యతిరేకంగా ఆయన చేసి పోరాటం గొప్పదని కొనియాడారు. అలాగే సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం జిల్లానాయకులు వీరశేఖర్, డీవైఎఫ్ఐ శ్రీనివాసులు, సీఐటీయూ అశోక్‌లు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి, దేశం కోసం భగత్‌సింగ్ పోరాటం చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో రామాంజినేయులు, రవి, లాలు, భాస్కర్ పాల్గొన్నారు.



పత్తికొండలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న బీజేపీ నాయకులు

పత్తికొండ: స్వాతంత్ర్య పోరాటంలో అసువులు బాసిన భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురువుల 94వ వర్ధంతి కార్యక్రమాలు పత్తికొండలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శారద వృద్ధ ఆశ్రమంలో బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ గోవర్ధన్, మండల అధ్యక్షుడు కరణం నరేశ్‌ల ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో దండి మల్లికార్జున, పూన మల్లికార్జున, రంగన్న, వీరేశ్, సురేంద్ర పాల్గొన్నారు.

ఆస్పరి: భారత స్వతంత్రం కోసం చిరు ప్రాయంలోనే ఉరికంబమెక్కి ప్రాణ త్యాగం చేసిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్ 79వ వర్ధంతి వేడుకలు మండల కేంద్రం ఆస్పరిలో సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి కృష్ణ మూర్తి మండల నాయకులు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హనుమంతు, నల్లన, గోపాల్, శేఖర్, పులి, రంగస్వామి, రామయ్య, మహానంది, రవి పాల్గొన్నారు.



ఆస్పరిలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

బెట్టింగులకు దూరంగా ఉండాలి

మద్దికెర, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): యువత బెట్టింగు యాప్‌లకు దూరంగా ఉండాలని ఎస్ఐ విజయకుమార్ నాయక్ అన్నారు. ఆదివారం మెయిన్ బజారులో యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెట్టింగ్ లోన్ యాప్‌ల వల్ల యువత అప్పులపాలవుతోందని అన్నారు. బంగారు భవిష్యత్తు కోల్పోతున్నారని, అందువల్ల వీటికి అలవాటు పడవద్దని సూచించారు. ఎవరైనా బెట్టింగులకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసులు చంద్ర, షేకన్న, మస్తాన్, భరత్, రవినాయక్ ఉన్నారు.

హంపలో పారిశుధ్య పనులు

మద్దికెర, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హంప గ్రామంలో సర్పంచ్ రాజగోపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వన్నూరప్ప పారిశుధ్య పనులు చేపట్టారు. ఆదివారం గ్రామంలో 20 మంది పంచాయతీ కార్మికులతో గ్రామం మొత్తం పారిశుధ్య పనులు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పంచాయతీకి ఇంటి పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రజలు స్నానపు గదుల నీరును బయటకు వదలకూడదని తెలిపారు. వేసవి కాలం దృష్టిలో ఉంచుకుని నీటి ఎద్దడి తలెత్తకుండా నీటి పథకాలను మరమ్మతులు చేశామన్నారు.

పంట మార్పిడి తప్పనిసరి

తుగ్గలి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రైతులు పంట మార్పిడిలు తప్పనిసరిగా చేపట్టాలని ఏవో పవన్ కుమార్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఏటా సాగు చేసే పంటలనే సాగు చేస్తుంటే దిగుబడులు తగ్గి రైతులు నష్టపోతారనీ, అలా కాకుండా ఏటా పంట మార్పిడిలు చేపడుతూ అంతర్గత పంటలు కూడా చేపట్టాలన్నారు.

రేపు గ్రామ పంచాయతీ వేలాలు

పత్తికొండ టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ మేజర్ గ్రామ పంచాయతీకి సంబంధించిన వేలాలు ఈ నెల 25న నిర్వహిస్తున్నట్లు ఈవో నరసింహులు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2025 సంవత్సరానికి సంబంధించి వారపు సంత, దినసరి మార్కెట్, బస్టాండు, మాంసపు మార్కెట్‌లకు వేలాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 25న ఉదయం 11 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలాలు ప్రారంభమవుతున్నాయని, ఈ వేలాల్లో పాల్గొనదలచే వారు డిపాజిట్ చెల్లించాలని కోరారు.

నిరంతరం విద్యుత్ అందిస్తాం

తుగ్గలి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడడమే లక్ష్యమని విద్యుత్ శాఖ ఏఈ మహేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని తుగ్గలి, జొన్నగిరి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ వినియోగదారులతో మాట్లాడుతూ విద్యుత్ బకాయిలు లేకుండా సక్రమంగా ప్రతి నెలా బిల్లులు చెల్లించాలన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీలు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం ఉందన్నారు. అంతకుమించి విద్యుత్ వినియోగిస్తే రూ.1000 విద్యుత్ చార్జీలు వస్తాయన్నారు. అలాగే వేసవి కాలంలో ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ అందిస్తామన్నారు.

తూము ఏర్పాటు చేయండి

వెల్దుర్తి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా సుజల స్రవంతి కాలువకు తూము ఏర్పాటుచేసి మల్లెపల్లె, బొమ్మిరెడ్డిపల్లె, నార్లాపురం గ్రామాలకు సాగునీటిని ఇవ్వాలని టీడీపీ సీనియర్ నాయకుడు సుబ్బరాయుడు హెచ్ఎన్ఎస్ అధికారులకు తెలియజేశారు. హెచ్ఎన్ఎస్ అధికారులు రామకృష్ణ, మధు, శ్రీనివాసులుతో కలిసి మల్లెపల్లె వద్ద కాలువను పరిశీలించారు. కార్యక్రమంలో క్రిష్ణగిరి టీడీపీ నాయకులు మర్రి శ్రీరాములు, ఆలంకొండ నబి ఉన్నారు.

వేతనాలు ఇవ్వరా..?

తుగ్గలి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనులు చేసిన కూలీలకు వేతనాలు చెల్లించరా అని సీపీఎం మండల అధ్యక్షుడు శ్రీరాములు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దాదాపు మూడు నెలలు గడుస్తున్నా జాతీయ ఉపాధి హామీ పథకం వెళ్లిన కూలీలకు వేతనాలు ఇవ్వలేదని అన్నారు. వేతనాలు చెల్లించకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

రాయలసీమ రత్నం 'వెంకటనరసా నాయుడు'

వెల్దుర్తి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ప్రముఖ రంగస్థల కళాకారుడు రాయలసీమ రత్నం బిరుదాకింతుడు 'వెంకటనరసానాయుడు' వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఆదివారం వెల్దుర్తిలో జానకిరామ నాటక కళా నిలయంలో రంగస్థల కళాకారులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటనాయుడు, వాల్మీకి సంక్షేమ సంఘం నాయకుకు గోపినాథ్ నాయుడు, బలరామనాయుడు, వెంకటనర్సు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



జొన్నగిరి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

తుగ్గలి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. ఆదివారం మండల పరిధిలోని జొన్నగిరి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1982-1987 వరకు 6 నుంచి పదో తరగతి వరకు చదివిన విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ముందుగా విద్య నేర్పిన గురువులకు శాలువాతో సన్మానాలు చేశారు. అలాగే అలనాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తాము పాఠశాలలో చదువుకున్న ప్రతి విద్యార్థి ఆ పాఠశాల రుణం తీర్చుకోవాలని, అందుకోసం ప్రతి విద్యార్థి ముందుకు రావాలని, అప్పుడే ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతాయన్నారు. పాఠశాల కోసం తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

పొగాకు రైతులను ఆదుకోవాలి



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

మద్దికెర, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో పొగాకు రైతులను ఆదుకోవాలని మండల సీపీఐ రైతు సంఘం అధ్యక్షులు మదనంతపురం హనుమన్న, ఉపాధ్యక్షులు నాగిరెడ్డి, కార్యదర్శి బొజ్జన అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో దాదాపు 500 ఎకరాలకు పైగా పొగాకు పంటను సాగు చేశారని, మార్కెట్ సదుపాయం లేకపోవడంతో సుదూర ప్రాంతాలకు తీసుకెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మద్దికెర ప్రాంతంలో పొగాకు పంటను సాగు చేస్తే దిగుబడి ఆశాజనకంగా వచ్చిందన్నారు. అయితే ఆదోని మండలంలో పొగాకు కొనుగోలు చేస్తారని అక్కడికి వెళితే వారు తేదీ ఇవ్వడం లేదన్నారు. పొగాకు అమ్ముకోలేక, నిల్వ ఉంచుకోలేక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. అకాల వర్షాలు కూడా వస్తున్నాయని, అందువల్ల పొగాకు తడిసే ప్రమాదం ఉందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి పొగాకును కొనుగోలు చేయాలని కోరారు.

రూ.690 కోట్లతో అమృత ధార



సమావేశంలో మాట్లాడుతున్న సభ్యుడు

దేవనకొండ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పందికొన రిజర్వాయర్ నుంచి చుట్టుపక్కల 213 గ్రామాలకు నీటి సమస్య పరిష్కరించేలా అమృతధార కింద రూ.690 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీమోహన్ మండల సర్వసభ్య సమావేశంలో తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ లక్ష్మీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో నీటి సమస్య రాకుండా చుడాలని ఎంపీడీవో సూర్యనారాయణ ప్రజాప్రతినిధులను ఆదేశించారు. తెర్నేకల్‌లో కందుల కొనుగొలు కేంద్రం ఏర్పాటు చేయాలని సర్పంచు అరుణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు నామాల శ్రీనివాసులు కోరారు. ఆదివారం సమావేశంపై కొందరు సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. 22 బేసిక్, 25 మోడల్ పాఠశాలలను ఏర్పాటు చేసినట్లు ఎంఈవో 2 నిర్మలదేవి తెలిపారు. డీఎస్టీ హస్టల్‌ను పునఃప్రారంభించాలని, మోడల్ స్కూల్ ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు శరత్ ఎంపీపీకి వినతి పత్రం ఇచ్చారు. హౌసింగ్ డీఈ ఆదినారాయణ, విద్యుత్ ఏఈ రవీంద్ర, ఎంఈవో తిమ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పత్తికొండ టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కేడీసీసీ బ్యాంకు మాజీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, మాజీ మండల అధ్యక్షురాలు నాగరత్నమ్మలు అన్నారు. ఆదివారం పట్టణంలోని సాయిబాబా దేవాలయ ప్రాంగణంలో విశ్వభారతి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి 44 మందికి కంటి ఆపరేషన్లకు సిఫారసు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీకాంత్ రెడ్డి, బండయ్య తదితరులు పాల్గొన్నారు.

మిర్చిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

మద్దికెర, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతు సాగు చేసి పండించిన మిర్చి పంటను క్వింటం రూ.25 వేలతో ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్లు, మండల వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జి.కృష్ణ, మాజీ ఉప సర్పంచ్ వెంకట్రామిరెడ్డి అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది దిగుబడి ఆశాజనకంగా ఉన్నప్పటికీ గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎకరాలో మిర్చి పండించడానికి దాదాపు రూ.1.50 లక్షల వరకు ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. గత ఏడాది 25 వేల నుంచి దాదాపు 35 వేల వరకు క్వింటం మిర్చి ధర పలికిందని, ఈ ఏడాది దారుణంగా రూ.12 వేల నుంచి రూ.15 వేలకు పడిపోయిందని తెలిపారు. ప్రభుత్వం కొనుగోలు చేసి మిర్చి రైతులను ఆదుకోవాలన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం

వెల్దుర్తి టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి ప్రభుత్వం సహకరిస్తుందని వెల్దుర్తి గ్రామ పెద్దలు బొమ్మన నరేంద్రనాథ్ రెడ్డి, బొమ్మన దశరథరామిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఏబీఎం చర్చిలో ఏబీఎం సంఘ పెద్దలు వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ తాతల కాలం నాటి నుంచి రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవ చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే తాను ఏబీఎం స్కూల్‌కు 30 సెంట్ల స్థలాన్ని ఇచ్చి నిర్మాణాన్ని చేపట్టామని చెప్పారు. త్వరలోనే నిర్మాణ పనులను పూర్తి చేసి పాఠశాలను ప్రభుత్వానికి అందిస్తామన్నారు.

మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేయాలి

ఆదోని టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కళాశాల నిర్మాణం పనులు పూర్తి చేయాలని ప్రభుత్వ ఆసుపత్రుల సలహా సంఘం మాజీ సభ్యుడు నసీరుద్దీన్ పటేల్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం రావడంతో పనులు ఆగిపోయాయని అన్నారు. అత్యవసర వైద్యం కోసం ప్రజలు కర్నూలుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేసి మెరుగైన వైద్యం అందుబాటులోకి తేవాలని కోరారు.

మానవత్వం చాటుకున్న మిత్ర బృందం



ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

పత్తికొండ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పత్తికొండ మండలం నలకదొడ్డి గ్రామంలో గుండెపోటుతో మృతి చెందిన తమ మిత్రుని కుటుంబానికి ఆర్థిక చేయూతనందించింది. మండల పరిధిలోని నలకదొడ్డి గ్రామానికి చెందిన వడ్డె రామాంజనేయులు ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. అతనితోపాటు తెలుగు యువతలో కలిసి తిరిగిన మిత్ర బృందం రూ.62 వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. మిత్రుని మరణం బాధను కలిగించిందని ఆ కుటుంబానికి ఆసరాగా ఉంటుందని నగదును అందించామని బృందం సభ్యులు రఘు, బత్తిన రాజశేఖర్ తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

వెల్దుర్తి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన వెల్దుర్తికి చెందిన దానమయ్య కుటుంబానికి 1994-95 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన మిత్రులు ఆదివారం రూ.32 వేల ఆర్థిక సాయం అందజేశారు. మిత్రుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

● జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మన్న

మంత్రాలయం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని జనసేన ఇన్‌చార్జి లక్ష్మన్న కోరారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో వాల్మీకులు, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌షాలతో మాట్లాడి బిల్లును ప్రవేశ పెట్టాలని కోరారు. ఓర్వకల్లు పర్యటనకు వచ్చిన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను కలిసి సమస్యను వివరించామని సానుకూలంగా స్పందించారని తెలిపారు. త్వరలోనే వాల్మీకుల బిల్లు కోసం ముఖ్యమంత్రితో మాట్లాడి న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో జనసేన పార్టీ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారన్నారు.

వైభవంగా మౌలాలి స్వామి ఉరుసు

మంత్రాలయం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం గ్రామంలో వెలసిన మౌలాలి స్వామి ఉరుసు వైభవంగా జరుపుకున్నారు. ఆదివారం ఉరుసులో భాగంగా స్వామి వారికి పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలు సుగంధ ద్రవ్యాలతో అలంకరించారు. వివిధ రకాల విద్యుత్ దీపాలతో మౌలాలిస్వామి దర్గాను అలంకరించారు. స్వామివారికి భక్తులు నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవాలి, సంగీత కచేరీ, భక్తిపాటలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలోని 164 జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ముగతి గ్రామానికి చెందిన రెహమాన్ కూలీ. ఆదివారం సంత చేసుకొని మళ్లీ గ్రామానికి వెళ్తుండగా అటుగా వచ్చిన వెరుశనగ లారీ ఢీకొన్నది. దాంతో రెహమాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. రెహమాన్‌కు భార్య, ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి: సీపీఎం

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాఘవేంద్ర కాలనీ సంజీవయ్య నగర్ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కాలనీలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి గోవిందు మాట్లాడుతూ రాఘవేంద్ర కాలనీవాసులు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నా అధికారులకు మాత్రం చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. గతంలో సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేయగా, సమస్యను పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారన్నారు. నేటికి సమస్య పరిష్కరించలేదన్నారు. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు స్పందించి పైప్‌లైన్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే సంజీవయ్య నగర్, రాఘవేంద్ర కాలనీ, లక్ష్మీపేటలో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాన్ని చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాముడు, సురేష్, అబ్దుల్లా, నాయకులు రాజు, సుభాన్, బజారి పాల్గొన్నారు.

మహిళా అభ్యాసకులకు పరీక్షలు



కోసిగి ఆది ఆంధ్ర ప్రాథమిక పాఠశాలలో మహిళలకు పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

కోసిగి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఉల్లాస్ పథకం కింద శిక్షణ పొందిన నిరక్షరాస్య మహిళలకు ఆదివారం కోసిగిలోని ఆదిఆంధ్ర ప్రాథమిక పాఠశాలలో అభ్యాసన పరీక్షలు నిర్వహించారు. ఉత్తీర్ణత సాధించిన వారికి సర్టిఫికెట్లను అందజేస్తామని అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ ప్రతాప్, సూపర్‌వైజర్ జాకీర్ హుశేన్, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ఏపీఎం సత్యమ్మ అన్నారు. జిల్లాలో తొమ్మిది మండలాలు కోసిగి, సి.బెళగల్, ఆస్పరి, దేవనకొండ, క్రిష్ణగిరి, కోడుమూరు, కల్లూరు, ఓర్వకల్లు, కర్నూలు మండలాల్లో మొదటి విడతగా 28,872 మందిని నిరక్షరాస్యులను గుర్తించామన్నారు. గ్రామ స్థాయిలో 2,887 కేంద్రాలను ఏర్పాటు చేసి 28,877 మంది స్వచ్ఛంద బోధకులను ఏర్పాటు చేశామన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన సభ్యులు

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీని ఎన్నుకున్నట్లు కమిటీ కన్వీనర్ ఎస్ దేవసహాయం తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 2025 డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్‌గా పరిగెల భాస్కర్, వైస్ చైర్మన్‌గా బుడగ జంగం రుద్రాక్షల పెద్దయ్య, సభ్యులుగా చిన్న పిల్లల వైద్య నిపుణుడు బాలయ్య, జి. ఆనంద్, కదిరికోట ఆదెన్న, రోజా ఆర్ట్స్ ఉసేని, రుద్రాక్షల దస్తగిరి, సూమాల అంథోనిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 14న పట్టణంలో తహసీల్దారు కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్న అంబేడ్కర్ జయంతోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.



బూదూరులో బురదమయమైన రోడ్డు



రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

మురుగు దారులు



తిమ్మాపురంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

మంత్రాలయం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు ఎంత శుభ్రంగా ఉంటే ప్రజలు అంత ఆరోగ్యంగా ఉంటారు, కానీ గ్రామస్థాయిలో కొన్ని గ్రామాలు పరిశుభ్రకు దూరమై అపరిశుభ్రంగా మారి రోగాల బారిన పడే విధంగా తయారయ్యాయి. ఈగలు, దోమలు, పందులు వ్యాధులకు కారణంగా నిలుస్తున్నాయి. మండలంలోని సూగూరు, బూదూరు, తిమ్మాపురం, వగరూరు, కల్లుదేవకుంట, చిలకలడోన గ్రామాల్లో మురుగు కాలువలు కంపు కొడుతున్నాయి. మురుగు కాలువల నిండా చెత్తచెదారంతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. మురుగు కాలువల్లో పందులు, కుక్కలకు, దోమలకు నిలయంగా మారాయి. మురుగు కాలువలు నిండి రోడ్లపైనే ప్రవహిస్తున్నాయి. రాత్రిపూట దోమలు కునుకు తీయకుండా చేస్తున్నాయి. మురుగు కాలువలను శుభ్రం చేయించాల్సిన గ్రామ కార్యదర్శులు, సర్పంచులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

- ● రోడ్లపైనే మురుగు
- ● వెదల్లుతున్న దుర్వాసన
- ● విజృంభిస్తున్న దోమలు
- ● పట్టించుకోని అధికారులు

పనులు చేపడతాం



గ్రామాల్లో రోడ్లల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తా. స్వచ్ఛభారత్ కార్మికులకు సక్రమంగా జీతాలు రాకపోవడంతో పనులు చేయడం లేదు. గ్రామస్థులు కూడా చెత్తాచెదారం రోడ్లపైన, మురుగు కాల్వల్లో వేయరాదు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి.

- వీరారెడ్డి, సర్పంచ్, వి.తిమ్మాపురం

గ్రామ కార్యదర్శులదే బాధ్యత



గ్రామాలను శుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత గ్రామ కార్యదర్శులపై ఉంది. వారితో సమావేశమై గ్రామాలను శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. ప్రతి కాలనీలో గ్రామ కార్యదర్శులు పర్యటించి మురుగు కాలువలు శుభ్రం చేయించడం, రోడ్లను ఊడిపించాలి. లేకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. సర్పంచులతో మాట్లాడి శుభ్రత పనులు వెంటనే చేపట్టాలి.

- ప్రభావతిదేవి, ఈవోఆర్‌డీ, మంత్రాలయం

బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

- ఆర్డీఎస్ కుడి కాలువ సాధన సమితి ఆధ్వర్యంలో దీక్షలు

ఎమ్మిగనూరు, మార్చి23 (ఆంధ్రజ్యోతి): ఆర్డీఎస్ కుడికాలువ నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఆర్డీఎస్ కుడికాలువ సాధన సమితి నాయకుడు కేఆర్ రాఘవరెడ్డి, ఉపాధ్యక్షులు సత్యనారాయణరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో సాధన కమిటీ టీచర్ నాగన్న ఆధ్వర్యంలో కమిటీ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు ఒక రోజు నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుంగభద్ర నదిపై ఆర్డీఎస్ కుడికాలువ నిర్మించుకోవటానికి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ హక్కులు ఇచ్చిందన్నారు. అయితే పాలక ప్రభుత్వాలు నిధులు కేటాయించకుండా కర్నూలు జిల్లా పశ్చిమప్రాంతాన్ని శాశ్వతకరువు ప్రాంతంగా మార్చాయన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ప్రతి ఏడాది తుంగభద్రనదిలో 150టీఎంసీల జలాలు శ్రీశైలం జలాశయంలో కలుస్తున్నాయన్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రాంతంలో రిజర్వాయర్ల నిర్మాణాలకు నిధులు కేటాయించకుండా మోసపూరిత వాగ్దానాలతో అభివృద్ధి చేయడం లేదని విమర్శించారు. ఆర్డీఎస్ కుడికాలువ నిర్మాణానికి నిధులు తీసుకొచ్చేందుకు ఎమ్మిగనూరు, మంత్రాలయం ఎమ్మెల్యేలు



దీక్షల్లో పాల్గొన్న ఆర్డీఎస్ కుడి కాలువ సాధన సమితి నాయకులు

పోరాటం చేయాలని లేని పక్షంలో వారి ఇళ్లను ముట్టడిస్తామన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఆర్డీఎస్ కుడికాలువ నిర్మాణానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ పంపన్న గౌడ్, నాయకులు బతకన్న, గణేష్, నీలకంఠ, ఎస్ సాంసోన్, స్వామిదాసు, వీరప్రతాప్, ఉరుకుందు, నాగేష్, నరసన్న, లక్ష్మన్న, గడ్డం ఉసేని, ఎల్లప్ప పాల్గొన్నారు.

రాఘవేంద్ర స్వామికి నవరత్నాల కవచం



మంత్రాలయం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్చారణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద స్వామి మూల బృందావనానికి నవరత్నాల కవచం సమర్పణ సేవ రమణీయంగా చేశారు. ఆదివారం పాల్గుణ నవమి శుభదినం సందర్భంగా పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు ఆధ్వర్యంలో మఠం పండితులు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, ప్రత్యేక పుష్పాలు, నవరత్నాల కవచంతో చూడముచ్చటగా అలంకరించారు. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

రాఘవేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు



అగసనూరులో రాఘవేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్ రెడ్డి

కోసిగి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అగసనూరు గ్రామంలో వెలసిన రాఘవేంద్రస్వామికి ఆలయంలో అర్చకులు వెంకటేశ్ స్వామి నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. తుంగభద్ర నదీతీరాన రాఘవేంద్రస్వామి నూతన ఆలయ ప్రతిష్ఠాపన, మూలబృందావనం ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మురళి రెడ్డి పాల్గొని రాఘవేంద్రస్వామి బృందావనానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో హోమగుండాన్ని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ పెద్దలు వైసీపీ నాయకులకు తీర్థప్రసాదాలు అందజేసి పూలమాలలు, శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు లక్ష్మీనారాయణ రెడ్డి, అగసనూరు సర్పంచ్ ఉలిగయ్య, మాజీ సర్పంచ్ ఆకాష్ రెడ్డి, రామన్న, నాగేష్, బీమన్న, నాగేంద్ర ఉన్నారు.

మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేయాలి

ఆదోని టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కళాశాల నిర్మాణం పనులు పూర్తి చేయాలని ప్రభుత్వ ఆసుపత్రుల సలహా సంఘం మాజీ సభ్యుడు నసీరుద్దీన్ పటేల్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం రావడంతో పనులు ఆగిపోయాయని అన్నారు. అత్యవసర వైద్యం కోసం ప్రజలు కర్నూలుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేసి మెరుగైన వైద్యం అందుబాటులోకి తేవాలని కోరారు.

రాజకీయాలకు అతీతంగా విధులు నిర్వర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీవిద్య

పెద్దకడబూరు, మార్చి23(ఆంధ్రజ్యోతి): అన్ని శాఖల అధికారులు రాజకీయాలకు అతీతంగా చిత్తశుద్ధితో పని చేయాలని ఎంపీపీ శ్రీవిద్య అన్నారు. ఆదివారం పెద్దకడబూరులోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. సమావేశానికి హాజరుకాని అధికారులకు నోటీసులు ఇవ్వాలని ఎంపీడీవో నాగరాజుస్వామికి సూచించారు. అనంతరం హనుమాపురం ఎంపీటీసీ నరవ శశిరేఖ మాట్లాడుతూ మూడు నెలలకోకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశానికి సమయానికి రాకపోవడంతో ఎంపీడీవోను నిలదీశారు. అలాగే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేతప్పుడు సభ్యులకు సమాచారం ఇవ్వాలని కోరారు. హనుమాపురం గ్రామంలో తాగునీటి సమస్య అధికంగా ఉందని గత మీటింగ్‌లోనే తెలియజేసిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయి కూమార్ పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో జడ్పీటీసీ రాజేశ్వరి, ఏంఈవో సువర్ణ, ఈవోపీఆర్డీ జయరాముడు, ఆయా శాఖ అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఫరూక్‌ను పరామర్శించిన సోమిశెట్టి

కర్నూలు అర్బన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు పరామర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో ఆయన సతీమణి షహనాజ్ మృతిపై అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యంచెప్పి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఎమ్మిగనూరులో వైద్య శిబిరం



మాట్లాడుతున్న ప్రముఖ వైద్యుడు గౌడప్ప గౌడ్

ఎమ్మిగనూరు, మార్చి23 (ఆంధ్రజ్యోతి): పేదలకు వైద్యసేవలు అందించేందుకు బసవేశ్వర వీరశైవ సంక్షేమసంఘం, జంగమ ఉమామహేశ్వర సంఘం నిర్వాహకులు వైద్యశిబిరం నిర్వహించటం అభినందనీయమని ప్రముఖ వైద్యుడు గౌడప్ప గౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయం ఆవరణంలో ఆయా సంఘాల ఆధ్వర్యంలో కర్నూలులోని కిమ్స్ ఆసుపత్రి వైద్యులు వైద్యశిబిరం నిర్వహించారు. మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వీరశైవలింగాయతి ఫెడరేషన్ మాజీ అధ్యక్షుడు వై రుద్రగౌడ్, రిక్రియోషన్ క్లబ్ అధ్యక్షులు పురుషోత్తం గౌడ్, వీరశైవ సంగం నాయకులు బీకే నాగరాజు గౌడ్, ఆయా సంఘాల అధ్యక్షకార్యదర్శులు నాగరాజు గౌడ్, మూర్తి, నాయకులు పరమేష్, గూళేప్ప, ఆలే ఈరన్న, టీచర్ ఈరన్న పాల్గొన్నారు.

27న బహిరంగ వేలం

కౌతాళం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఈ నెల 27న (గురువారం) బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సర్పంచ్ పాల్‌దినకరన్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీకి సంబంధించిన ఆదాయ వనరులైన దినసరి మార్కెట్, బండిమెట్టు, కబేళాకు సంబంధించి వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు పంచాయతీ సూచించిన నియమ నిబంధనల మేరకు ప్రకారం ధరావత్తు చెల్లించాలని తెలిపారు.

ఘనంగా భగత్‌సింగ్ వర్ధంతి



ఎమ్మిగనూరులో భగత్‌సింగ్‌కు నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు రాజు,ప్రసాద్

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ దేశం కోసం తన ప్రాణాలను త్యాగం చేశారని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసి నాయకులు రాజు, ప్రసాద్ అన్నారు. ఆదివారం స్వాతంత్ర్య సమరయోధులు సర్దార్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అమరుల స్ఫూర్తితో మన పోరాట ఉద్యమాలను ముందుకు సాగిద్దామన్నారు. కార్యక్రమంలో ప్రజా, కార్మిక సంఘాల నాయకులు రాజు, ప్రసాద్, యోసేపు, ఆగస్టీన్, గురురాజు పాల్గొన్నారు.

కోసిగి: స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల ఆశయాలకు కృషి చేద్దామని ఏఐఎస్ఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు వీరేష్, రాజు, చిన్న అన్నారు. ఆదివారం భగత్‌సింగ్ రాజ్‌గురు సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని పురస్కరించుకొని భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోసిగిలోని స్థానిక చాకలీవీధిలోని పాఠశాలలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ అధ్యక్షతన కొవ్వొత్తులతో భగత్‌సింగ్‌కు నివాళులర్పించారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు చిన్న, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రాజు మాట్లాడుతూ భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో యువజన సమస్యలకు రాజీలేని పోరాటాలు సాగిస్తామన్నారు. దేశ సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన రియల్ హీరోలు అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు, సీజనల్ హాస్టల్స్ విద్యార్థులు ఉన్నారు.

మంత్రాలయం: స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని మంత్రాలయంలో నిర్వహించారు. ఆదివారం ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు చిన్న, రాజుల ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మంత్రాలయం ఏఐవైఎఫ్ నాయకులు మనోజ్, మురళి, ఫణీంద్ర, కిరణ్, విజయ్, చిన్నరాజు, అంజి, భరత్ పాల్గొన్నారు.



మంత్రాలయంలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



కోసిగిలో భగత్‌సింగ్ చిత్రపటానికి కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు